క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాధికారి రమేశ్

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్ట్ పోస్టర్‌ను మంగళవారం జిల్లా విద్యాధికారి రమేశ్ ఆవిష్కరించారు. చెకుముకి సైన్స్ సంబురాలు–2024 సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న 8వ, 9, పదో తరగతి విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నారు. జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు, జిల్లా గౌరవాధ్యక్షుడు గుర్రం ఆంజనేయులు, జిల్లా కోశాధికారి మెడపట్ల కిషన్, జిల్లా కార్యదర్శి రాజలింగం, జిల్లా ప్రచార కమిటీ బాధ్యులు కులేరి ప్రేమ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న వైస్ చైర్మన్ తిరుపతి

కోనరావుపేట: మండలంలోని వట్టిమల్ల (భూక్య రెడ్డి తండా)కు చెందిన భూక్య కిషోర్ (29) ఏడాదికింద విద్యుదాఘాతంతో మృతిచెందాడు. సెస్ సంస్థనుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మండలకేంద్రంలోని సెస్ కార్యాలయంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి మృతుడి భార్య విజయకు అందజేశారు.విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇక్కడ సెస్ ఏఈ దివ్య, ఎల్లారెడ్డిపేట సెస్ మాజీ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి, సెస్ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపిక



చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆర్శనపెల్లి అక్షయ రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలసంకుల జితేందర్, పీఈటీ అనిత తెలిపారు. ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జోనల్ స్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్ లాంగ్ జంప్, హై జంప్ పోటీల్లో ప్రతిభ చూపి ద్వితీయస్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా అక్షయను ఉపాధ్యాయులు అభినందించారు.

గంభీరావుపేట: మండలంలోని కొత్తపల్లి పాఠశాలకు చెందిన విద్యార్థి శశిధర్ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. ఈనెల 7 నుంచి 9 వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలు జరుగనున్నాయి. శశిధర్‌ను ప్రధానోపాధ్యాయుడు వెంకటరామారావు, పీడీ భాను, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో నాగులచవితి



పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: మండలంలో కార్తీకమాసం మంగళవారాన్ని పురస్కరించుకొని నాగుల చవితి వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రేణుకామాత ఆలయంలోని నాగదేవత విగ్రహం, నారాయణపూర్ సాయిబాబా ఆలయం వద్ద పుట్టల్లో పాలుపోశారు. పసుపు, కుంకుమ, పండ్లతో మొక్కులు చెల్లించుకున్నారు.

విచారణ



తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని సంద్రవాగు సమీపంలో అనుమతులు లేకుండా ఓ వ్యక్తి రాత్రికి రాత్రే పెద్ద బావిని తవ్వించాడని, దీంతో చుట్టుపక్కల రైతులకు నీటి సమస్య ఏర్పడిందని గంగ రాజిరెడ్డి అనే రైతు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు మంగళవారం బావి వద్దకు వెళ్లి పరిశీలించి విచారణ జరిపారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. రెవె న్యూ, ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నివాళి

వేములవాడఅర్బన్: పట్టణంలోని న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో దాశరథి కృష్ణమాచార్య వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మినా రాయణ మాట్లాడారు. ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, విజయ, విద్యార్థులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



గంభీరావుపేట: క్రీడా దుస్తులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



వీర్నపల్లి: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని సాహితీ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. లయన్స్ క్లబ్ ఎల్లారెడ్డిపేట శాఖ సభ్యుడు కోట సతీశ్‌కుమార్, రాంచంద్రంలు సాహితీకి స్పోర్ట్స్ షూస్, దుస్తులు అందించారు. లయన్స్ క్లబ్ సభ్యులు నారాయణ, ప్రధానోపాధ్యాయుడు సోమయ్య, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న బి. అరుణ్ అండర్ 17, 8వ తరగతి చదివే త్రిలోచన అండర్ 14 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. విద్యార్థులను పీడీ ప్రతాప్‌కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రైతులకు ఇబ్బంది కలుగకుండా చూడాలి



చందుర్తి : కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్



వేములవాడ రూరల్ : చెక్కపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సుజాత

చందుర్తి: రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ శ్రీనివాస్ కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని సింగిల్‌విండో పరిధిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల ధాన్యాన్ని బస్తాకు 41.600 క్వింటాళ్ల తూకం వేయాలని కోరారు. అధికంగా తూకం వేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. తేమశాతం వస్తే వెంటనే తూకం వేస్తారని, రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని తెలిపారు. ఆయన వెంట కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

వేములవాడరూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని వేములవాడ రూరల్ తహసీల్దార్ సుజాత అన్నారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో ప్యాడీ సెంటర్‌ను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. తూకాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఆమెవెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

బోయినపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తహసీల్దార్ కాలె నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి, బోయినపల్లి గ్రామాల్లో ప్యాడీ సెంటర్లను మంగళవారం తనిఖీ చేశారు. రైతులను ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ మారుతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ.. ధాన్యం తూకంలో ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. లారీల కొరత గురించి రైతులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. ఆర్ఐ ప్రవీణ్, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

పారాబాయిల్డ్ మిల్లులకు ధాన్యం కేటాయించాలి



అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న మిల్లర్లు

సిరిసిల్లటౌన్: జిల్లాలో పారాబాయిల్డ్ రైస్‌మిల్లులకు ధాన్యాన్ని కేటాయించాలని మిల్లర్లు అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కోరారు. మంగళవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. తమకు కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించే ధాన్యానికి త్వరలోనే బ్యాంకు గ్యారంటీని అందజేస్తామన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా పాత గన్నీ సంచుల్లో ధాన్యం పంపించి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు ఇచ్చే ధాన్యానికి సరిపడా కొత్త బ్యాగులు ఇవ్వాలని కోరారు. గతేడాది రబీసీజన్ నిల్వల ఆధారంగా మిల్లులకు ధాన్యాన్ని కేటాయించాలని కోరారు. మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, శ్రీనివాస్ తదితరులున్నారు.

మహాధర్నాకు తరలిన ఆటోడ్రైవర్లు



హైదరాబాద్‌కు తరలుతున్న ఆటోడ్రైవర్లు

సిరిసిల్ల అర్బన్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహాధర్నాకు జిల్లాలోని 200 మంది ఆటో డ్రైవర్లు తరలివెళ్లినట్టు సిరిసిల్ల జిల్లా ఆటో జేఏసీ అధ్యక్షుడు అల్లె శ్రీనివాస్ తెలిపారు. మహాలక్ష్మి పథకంతో ఆటోడ్రైవర్లు నష్టపోతున్నారని, ఆటో డ్రైవర్‌కు ఏడాదికి రూ.15వేలు ఇవ్వాలన్నారు. 50 ఏళ్లు నిండిన ఆటోడ్రైవర్లకు వృద్ధాప్య పింఛన్ ఇవ్వాలన్నారు. ఆటో డ్రైవర్లు దేవరరాజు, హరీశ్, కనుకయ్య, ఖాన్, తదితరులున్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

సిరిసిల్ల అర్బన్: ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని టీపీయూఎస్ జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని కలెక్టర్ కార్యాలయం ముందు మంగళవారం ధర్నా చేపట్టారు. ఉపాధ్యాయులకు డీఏ, పీఆర్సీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన పొందిన ఉపాధ్యాయులకు పెన్షన్ బిల్లులు, సప్లమెంటరీ బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదర్కొంటున్నారన్నారు. ఇక్కడ టీపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లెంకల జయకృష్ణ, రాష్ట్ర కార్యదర్శులు జగన్ మోహన్, కటకం శ్రీనివాస్, రవి, తిరుపతి, రమేశ్, అంజన్న, లక్ష్మణ్ తదితరులున్నారు.

హమాలీలకు రేట్లు పెంచాలి



ముస్తాబాద్: హమాలీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేయాలని కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ పంతం రవి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో హమాలీ కార్మికులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లారీలో ధాన్యం లోడు చేసే హమాలీలకు తాడు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అందించే తాడు కూలీని తక్షణమే చెల్లించకపోతే జిల్లావ్యాప్తంగా పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. కార్మికుల కూలీ రేట్లు పెంచాలని కోరారు. ఈనెల 7న జరిగే మహాధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పాఠశాలలో పాము



సిరిసిల్ల ఎడ్యుకేషన్: పట్టణంలోని నెహ్రూనగర్ పాఠశాల ఆవరణలో మంగళవారం నాగుపాము కనిపించడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. మధ్యాహ్నం విరామ సమయంలో విద్యార్థుల మూత్రశాలల వద్ద నాగుపాము ఉంది. అటుగా వెళ్లిన విద్యార్థులు చూసి ఆందోళన చెందారు. దీంతో విషయాన్ని ఉపాధ్యాయులకు తెలపగా పామును చంపేశారు.

సంక్షిప్త వార్తలు

● **కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి**

కోనరావుపేట: గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సింగిల్‌విండో వైస్‌చైర్మన్ కాశవేని మహేశ్ అన్నారు. మండలంలోని సుద్దాలలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కచ్చకాయల ఎల్లయ్య, బాల్‌రెడ్డి, ఉప్పుల గంగయ్య, మహేశ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

● **చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి**

వీర్నపల్లి: యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వన్‌పల్లి గ్రామంలో మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. యువకులు ఉద్యోగాలు సాధించేందుకు కష్టపడి చదవాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్సై ఎల్లయ్య గౌడ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

● **రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు**

వేములవాడరూరల్: కారు, బైక్ ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... నూకలమర్రి నుంచి వేములవాడకు వెళ్తున్న కారు, చెక్కపల్లి నుంచి వెళ్తున్న అయిలవేని శ్రీనివాస్ బైక్‌ను ఢీకొనడంతో శ్రీనివాస్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు విచారణ జరిపి కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

● **బాధ్యతలు స్వీకరణ**

బోయినపల్లి: మండలకేంద్రంలోని కేజీబీవీ ఎస్‌వోగా లింగవ్వ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. లింగవ్వ వీర్నపల్లి నుంచి బదిలీలో భాగంగా బోయినపల్లి వచ్చారు. బోయినపల్లి ఎస్‌వోగా పనిచేసిన పద్మ వీర్నపల్లి కేజీబీవీ ఎస్‌వోగా బదిలీపై వెళ్లారు.

● **పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి**

వీర్నపల్లి: మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మాట్లాడుతూ... గత ప్రభుత్వం కాలయాపన చేస్తూ వారిని ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకొని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. ఇక్కడ గణేశ్, లంక రాజయ్య, ఇసంపల్లి రాజయ్య తదితరులున్నారు.

● **నియామకం**

సిరిసిల్లటౌన్: రాష్ట్ర పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడిగా సిరిసిల్లకు చెందిన శ్రీగాధ మైసయ్య నియామకమయ్యారు. మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ నియామక ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్లకు చెందిన గోనె ఎల్లప్ప, గుంటుకు మహేశ్‌ను జాయింట్ సెక్రటరీలుగా నియమించారు. తమ నియామకానికి సహకరించిన వారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన ఆటో డ్రైవర్లు

కోనరావుపేట: ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలుచేయాలంటూ రాష్ట్ర యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు కోనరావుపేట మండలం నుంచి ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలివెళ్లారు.

● **గంజాయి తాగుతున్న నలుగురి రిమాండ్**

సిరిసిల్లక్రైం: గంజాయి తాగుతున్న నలుగురిపై కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాంమోహన్ మంగళవారం తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం తాడూరు ఎల్లమ్మ ఆలయ సమీపంలో చీర్లవంచకు చెందిన పండుగ రాజశేఖర్, గంగు శ్రీనివాస్, ఒబులాపూర్ గ్రామానికి చెందిన పరిష ప్రశాంత్, కొమ్మెట చందు కలిసి గంజాయి తాడూరు ఎల్లమ్మ ఆలయ సమీపంలో తాగుతుండగా పోలీసులు పట్టుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసిన మంగళవారం రిమాండ్ తరలించారు.

● **ఆధ్యాత్మికబాటలో జీవించాలి**

ఎల్లారెడ్డిపేట: ఆధ్యాత్మికబాటలో ప్రతి ఒక్కరూ జీవించాలని జగిత్యాలకు చెందిన పండితులు శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సదనంలో మంగళవారం సత్సంగ సదనం 64వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు.

● **కార్యవర్గం ఎన్నిక**

ముస్తాబాద్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ మండలశాఖ నూతన కార్యవర్గం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఓలాద్రి యెల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దరిపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా వేముల శ్రీనివాస్, కొండా వెంకటేశ్వర్లు, ఆరేటి బాలరాజు, మల్లారెడ్డి, కార్యదర్శులుగా అశోక్, మహేశ్, అంజిరెడ్డి, సద్ది భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరిశీలకులుగా దేవిరెడ్డి హన్మంతరెడ్డి వ్యవహరించారు.

● **కార్యవర్గం ఎన్నిక**

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో ఇటీవల జరిగిన సర్దుబాటు ప్రక్రియ అసంబద్ధంగా ఉందని, వెంటనే ప్రభుత్వం సవరించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీహరి కోరారు. ఇప్పటికే ఉపాధ్యాయులు ఒత్తిడితో పనిచేస్తున్నారని, అసంబద్ధ సర్దుబాటును సవరించకపోతే మరింత ఒత్తిడికి గురయ్యే పరిస్థితులు ఉన్నాయన్నారు. మంగళవారం మండల డీటీఎఫ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బట్టారి సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, ఉపాధ్యక్షులుగా ఎండీ ఇబ్రహీం, సరిత, కార్యదర్శులుగా నాగలక్ష్మి, సౌమ్య ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడు డి.శ్రీహరి తదితరులు హాజరయ్యారు.

● **విజయకుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి**

సిరిసిల్ల ఎడ్యుకేషన్: నిర్మల్ బాగులవాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్‌నాథ్ రెడ్డి డిమాండ్ చేశారు. దిలావర్పూర్ గ్రామ పరిసరాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీకి వ్యతిరేకంగా అక్కడి అమాయక రైతులను రెచ్చగొడుతున్నారన్నారు. సమావేశంలో టీపీటీఎఫ్ సిరిసిల్ల జిల్లా బాధ్యులు మైలారం తిరుపతి, నూగురి దేవేందర్, రాజేందర్, ఉపేందర్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

● **పద్మశాలీలు ఆర్థికంగా ఎదగాలి**

ముస్తాబాద్: పద్మశాలీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని పద్మశాలీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరి రాజమల్లు అన్నారు. మండలకేంద్రంలో పద్మశాలీ సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం జరిగింది. డీఎస్సీలో జిల్లాస్థాయిలో అత్యుత్తమ ర్యాంకు సాధించి ఉపాధ్యాయుడిగా ఎంపికైన కొంక రామును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌరవా అధ్యక్షుడు సిలివేరి ధర్మయ్య, యాడారపు రాజు, శ్రీనివాస్, సత్యనారాయణ, తడుక రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

● **తహసీల్దార్‌కు వినతి**

ఇల్లంతకుంట : మండలంలోని అన్నిగ్రామాల ప్రజలకు ఇసుకకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ బీ ఆర్ ఎస్ మండల అ.ధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు ఎంద్రచందన్, మనోహర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, శ్రీకాంత్ తదితరులున్నారు



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే దారిలో మురుగు కాలువలు నిర్మించకపోవడంతో నీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు వెళ్లే భక్తులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీటిలో నుంచి ఆలయానికి వెళ్తూ ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ నిర్మించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : మీర్జా బేగ్
మండల పంచాయతీ అధికారి, తంగళ్లపల్లి, ఫోన్ నంబర్: 9490083683

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

'నిత్య జనగణమన' అభినందనీయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో వసంత రావు, డీఐఈవో శ్రీనివాస్

సిరిసిల్లకల్చరల్: జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే అవకాశాన్ని సామాన్యులకు కూడా కల్పించే నిత్య జనగణమన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి డాక్టర్ వసంతరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిత్య జనగణమన కార్యక్రమం సందర్భంగా 100వ రోజు జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ అధ్యాపకులు శ్రీధర్, శ్రీనివాసరావు, వెంకటేశం, సామల వివేకానంద, కనకయ్య, రాజయ్య, చంద్రమౌళి, అరుంధతి, ఆంజనేయులు, సరోజ, చంద్రశేఖర్, రాజశేఖర్, శ్రీనివా స్, నవీన్, సుజిత, నర్మద విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలుచేయాలి



మాట్లాడుతున్న ఆర్టీసీ కార్మికులు

సిరిసిల్ల అర్బన్: ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని తెలంగాణ ఆర్టీసీ జాయింట్ కమిటీ చైర్మన్ ఎల్ రాంరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడానికి గెజిట్ విడుదల అయినందున, జీవో విడుదల చేయాలన్నారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించి, 2021 వేతన సవరణ చేయాలని స్పష్టంచేశారు. కొత్త ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి, నియామకాలు చేపట్టాలని కోరారు. ఇక్కడ కో చైర్మన్ లక్ష్మణ్, ఆర్టీసీ కార్మికులు జీపీ సింగ్, దేవయ్య, ప్రకాశ్, శ్రీనివాస్, రఘునాయక్, మదన్, గణేశ్, శ్రీహరి, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన ఏది ?



ఖాళీ కుర్చీలతో దర్శనమిస్తున్న కార్యాలయం

సిరిసిల్లకల్చరల్: ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సిన ప్రభుత్వ కార్యాలయం ఇది. పట్టణ శివారులో ఉన్న ప్రభుత్వ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటల వరకు ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరుకాలేదు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3.30 వరకు డాక్యుమెంట్లు సమర్పించాలని గోడకు పోస్టర్ అంటించారు. కానీ కానీ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం సిద్ధమైన ప్రజలు నిరాశకు లోనయ్యారు. సమయపాలని పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని, ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

బోరు మోటార్లు తొలగించాలి

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు ఎగువభాగంలో రైతులు అక్రమంగా ఏర్పాటు చేసిన బోరుమోటార్లను వెంటనే తొలగించాలని జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులు సంబంధిత గ్రామాల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అధికారులకు నోటీసులు జారీచేశారు. కామారెడ్డి జిల్లా బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి మండలాల్లోని పలు గ్రామాలకు నోటీసులు అందించారు. ఎగువభాగంలో మోటార్లు, పైపులు ఏర్పాటు చేసుకోవడంతో ప్రాజెక్టు చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందించలేకపోతున్నామని ఇరిగేషన్‌శాఖ ఈఈ అమరేందర్‌రెడ్డి, డీఈ నర్సింగ్, ఏఈలు నోటీసుల్లో పేర్కొన్నారు.

శుభకార్యాలకు తగ్గింపు ధర

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో పరిధిలోని గ్రామాల ప్రజలకు శుభకార్యాల కోసం ఆర్టీసీ బస్సులను బుకింగ్ చేసుకుంటే భారీ తగ్గింపు ఉంటుందని వేములవాడ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ బస్సులు తీర్థయాత్రలు, వివాహాలకు బస్సులను గతం కంటే 20 శాతం తగ్గింపుకు అందిస్తున్నామని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 9959225926, 7382851826 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కిలోమీటర్‌కు రూ.లలో

బస్సులు	కొత్త రేటు	పాతరేటు
పల్లె వెలుగు	రూ.68	రూ.52
ఎక్స్ ప్రెస్	రూ.69	రూ.62
డీలక్స్	రూ.65	రూ.57
సూపర్ లగ్జరీ	రూ.65	రూ.59

'కేటీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ పని'

ముస్తాబాద్: ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను అమలుచేయకుండా కేవలం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విమర్శించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్ అన్నారు. మండలంలోని నామాపూర్‌లో మంగళవారం కేటీఆర్‌సేన సభ్యత్వ నమోదు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్న కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు చూసి స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించకుండా ప్రభుత్వం కాలం వెళ్లదీస్తుందని విమర్శించారు. జహంగీర్, స్వామి, వంగూరి దిలీప్, నారాయణ, అశోక్, రాజాగౌడ్, బాలచంద్రం, దేవేందర్, వకీల్, శేఖర్, మనీష్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.